# మృతులైన నీతిమంతులు నేరుగా పరలోకానికి వెళ్లతారా?

కన్నీటి చారలు కట్టిన ముఖంతో "మా అమ్మ ఎక్కడ?" అని ఒక పసికూన అడుగుతాడు. వానిని నీవు కౌగిటిలోనికి తీసికొని, బొంగురుబోయిన గొంతుతో, "పరలోకంలో ఉంది" అని చెప్పుతావు. ఇటీవలే విధవరాలియైన ఒక ముసలి స్త్రీ యింటిని దర్శించు. తన భర్త అంతిమ ఘడియల్లో పడిన తన పోరాటాన్ని గూర్చి చర్చించు. ఆమెను భుజం మీద మెల్లగా తట్టి, "ఆయన యిప్పుడు బహు శ్రేష్ఠంగా ఉన్నాడు, ఆయన దేవునితో ఉన్నాడు" అంటావు. ఆలాటి మాటలు మృతులను గూర్చిన దైవతత్వ శాస్త్రపు వార్తలా లేదు? ఉన్నదంతా ఈ జీవితానికి సంబంధించిందే కాదు, దేవుడు తన వారిని కాపాడుకుంటాడు అనే నీ విశ్వాసాన్ని వెలిబుచ్చే మాటలే.

కొరింథీయులకు వ్రాస్తూ, పౌలు యిలా అన్నాడు: "ఇట్లు ధైర్యము గలిగి యీ దేహమును విడిచిపెట్టి ప్రభువునొద్ద నివసించుటకు ఇష్టపడుచున్నాము" (2 కొరింథీ. 5:8). ఫిలిప్పీయులకు రాసిన పత్రికలో, "ఈ రెంటి మధ్యను ఇరుకున పడియున్నాను. నేను వెడలిపోయి క్రీస్తుతోకూడ నుండవలెనని నాకు ఆశయున్నది, అది నాకు మరి మేలు" అని అపొస్తలుడన్నాడు (ఫిలిప్పీ. 1:22, 23). క్రీస్తు యొక్క మరణ పునరుత్థానాన్ని బట్టి మృతులైన నీతిమంతులు నేరుగా పరలోకం వెళ్లతారని ప్రకటించడానికి యిది పౌలు యొక్క విధానంగా మనం భావించాలా? దానికి బదులుగా, నేడు మనం ఉపయోగించే సర్దుబాటు భాషగా[1] మనం వాటిని చూడవలసి యుండవచ్చు.

ఈ రెండు లేఖన భాగముల ఉద్దేశం మృతుల స్థితిని గూర్చి నూతన సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టడమేయని నమ్మే ఉపదేశకులు సువార్తికులను గూర్చి యిటీవలనే విన్నాను. వారి విశ్వాసాన్ని గూర్చిన నా జ్ఞానం పరిమితియైనదని ఒప్పుకొంటున్నాను. నీవు ప్రాముఖ్యమని ఎంచే అంశం విషయంలో నేను కొంత చర్చించ లేదంటే, అది నేను కావాలనే చేయలేదని చెప్పుతున్నాను.

నాకు లభ్యమైన సమాచారంలో, ఈ చర్చలో పరిచయం చేయబడ్డ వివిధములైన లేఖన భాగాలున్నాయి. నేను చూడగలిగినంత మట్టుకు, ఈ అంశానికి సంబంధించిందిగా ఏదీ నాకు కన్పించలేదు. ఇక్కడ ఉదాహరణలున్నాయి.

◆ *హెబ్రీ. 2:14.* క్రీస్తు చనిపోక ముందు అదృశ్యలోకంపై "అపవాదికి అధికార మున్నట్టు" చెప్పబడింది. దాన్ని రుజువు పరచే లేఖనం హెబ్రీ. 2:14 అట, అందులో అపవాదికి "మరణ బలముంది" అని చెప్పుతుంది. అయినా, పాతాళ లోకం మీద అపవాదికి ఏ శక్తీ ఉన్నట్టు ఈ వచనం చెప్పడం లేదు. దీనికి బదులు, జనులను

చంపడానికి సాతానుకు శక్తి (మానవ ఏజెంట్ల ద్వారా) ఉందని అది అంటుంది. (సాతాను) దేహాన్ని చంపిన తరువాత శరీరం లేని ఆత్మలపై ఎన్నడే ఏలాటి ఆధిపత్యం ఉన్నట్టు లేదు.

♦ *మత్తయి 12:24-29.* బయెల్జెబూలు అధికారాన్నిబట్టి క్రీస్తు దయ్యాలను వెళ్ల గొట్టుతున్నారనే నేరం ఆయన మీద మోపినప్పుడు, దానికి బదులుగా ప్రభువు యిలా అన్నారు: "ఒకడు మొదట బలవంతుని బంధింపని యెడల యేలాగు ఆ బలవంతుని యింటిలో చొచ్చి అతని సామగ్రి దోచుకొనగలడు? అట్లు బంధించినయెడల వాని యిల్లు దోచుకొనును" (మత్తయి 12:29). క్రీస్తు ప్రభువు చనిపోయినప్పుడు, పాతాళము లోనికి ("బలవంతుని యింట") ప్రవేశించి మృతులైన నీతిమంతుల ఆత్మలను (సాతాను "ఆస్తిని") తీసికొని పోయినట్టు ఈ లేఖనం చెప్పుతుందని భావించారు. ఊహాజనకమైన ఈ వ్యాఖ్యానం సందర్భానికి సంబంధించింది కాదు, జీవించుతున్న మనుష్యులలోనుండి దయ్యాలను వెళ్లగొట్టడమే దీని సందర్భం[2] (మత్తయి 12:24-29).

♦ *ఎఫెసీ. 4:8.* ఉపయోగించిన మరో వచనం ఎఫెసీ. 4:8 అది కీర్తనలు 68:18నుండి కోట్ చేయబడింది: "అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు, చెరను చెరగా పట్టుకొని పోయి మనుష్యులకు ఈవులను అనుగ్రహించెనని చెప్పబడియున్నది." "చెరగొనినవారు" అంటే, సాతానుచే బందీలుగా చేయబడిన పాతాళంలో ఉన్న నీతిమంతుల ఆత్మలనీ, క్రీస్తు ఆరోహణుడైనప్పుడు వారిని పరలోకానికి కొనిపోయారని కొందరు నమ్ముతారు. అయితే, ఆలాటి వ్యాఖ్యానాన్ని ఉద్దేశించినట్టు లేఖనంలోగాని, సందర్భంలోగాని ఏ సూచనా లేదు. మహా గొప్ప విజయం తరువాత విజయోత్సవంతో ఒక రాజు తన యింట ప్రవేశించాడనడానికి అది ఒక ఉదాహరణ మాత్రమే (2 కొరింథీ. 2:14-16ను దీనితో పోల్చి చూడు). ఆలాటి సైనిక గమనంలో నడిపింపబడేవారు ఓడింపబడి చెరపట్టబడిన శత్రువులే. సిలువలో క్రీస్తు తన శత్రువులను ఓడించారనడానికి ఉద్రేకం కలిగించడానికి ఉపయోగింపబడిన భాషా విధానమే. ఆయన ఆ విధంగా మనుష్యులకు "ఈవులనిచ్చుటకు" యోగ్యత పొందారు. సందర్భంలో, సజీవులైన క్రైస్తవులకు ఆయన ప్రసాదించే ఆత్మసంబంధమైన ఈవులను గూర్చి అది మాట్లాడుతుంది (ఎఫెసీ. 4:7-13).

చివరి పరిశీలనలో, మనం గతంలో ప్రస్తావించుకున్న రెండు లేఖన భాగాలే ప్రధాన రుజువులైయున్న లేఖనాలుగా మిగిలిపోతాయి: 2 కొరింథీ. 5:8; ఫిలిప్పీ. 1:23.[3] మృతులు మధ్యస్థ స్థితికిని, "ప్రభువుతో," "క్రీస్తుతో" ఉండడమనే పౌలు యొక్క ప్రతిపాదనలకును పొందిక కుదిర్చే మార్గమే లేదా?[4] ఈ జీవితకాలంలోనే క్రైస్తవులు "క్రీస్తుతో" ఉన్నట్టు క్రొత్త నిబంధన బోధిస్తుంది. ఎక్కడ యిద్దరు ముగ్గురు నా నామమున కూడియుందురో అక్కడ నేను వారి మధ్యనున్నాను అని ప్రభువు సూచించారు (మత్తయి 18:20). "యుగ సమాప్తి వరకు సదాకాలము నేను మీతోకూడ ఉన్నాను" అంటూ ప్రభువు వాగ్దానం చేశారు (మత్తయి 28:20). "ప్రభువు మీకందరికి తోడైయుండును గాక" అని పౌలు ప్రార్థించాడు (2 థెస్స. 3:16బి). ఆ క్రైస్తవులు యింకను జీవించి యున్నప్పుడే పౌలు ఈ మాటలు పలికాడు. మనం బ్రదికియున్నప్పుడు "మనతో కూడ"

నున్న ప్రభువు, మనం చనిపోయిన తరువాత మనతోనుండక మానరు. "ప్రభువు నందు మనము మృతిపొందియున్నట్టయితే" ఆయనతో మనకుండే బాంధవ్యం బహు సన్నిహితంగాను ఎడబాయనిదిగాను ఉంటుంది (ప్రకటన 14:13).

దీన్ని ఆలోచించు: అందరు కాకపోయినా, చనిపోయిన వెంటనే పరలోకం వెళ్లతామని నమ్మే అనేకులు, క్రీస్తు సిలువకు ముందు, లూకా 16:19-31 మృతుల స్థితిని సరిగా చిత్రిస్తుందని నమ్ముతారు. ఇది మనస్సులో పెట్టుకొని, ప్రసంగి 12:7 చూడు. "మరణమైనప్పుడు, మన్నయినది (భౌతిక దేహము) తిరిగి మంటికి చేరును, ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు మరల వెళ్లును" అని సొలొమోను అన్నాడు. ఆ రీజనింగును ఉపయోగించి, 2 కొరింథీ. 5:8కి, ఫిలిప్పీ. 1:23కు వర్తింపజేస్తే, క్రీస్తు సిలువలో మరణించక పూర్వమే (దేవుడున్న చోటికి) దేహాలు వదలిన ఆత్మలు నేరుగా పరలోకానికి వెళ్లినట్టు చెప్పబడ్డాయి. ప్రసంగి 12:7లో సర్దుబాటు భాష ఉపయోగించబడిందని అనకుంటే 2 కొరింథీ. 5:8, ఫిలిప్పీ 1:23లో కూడ పౌలు అదే భాషను ఉపయోగించి యున్నట్టు తీర్మానించవచ్చునుగదా?

"మృతులైనవారు ఎక్కడ?" అనే ప్రసంగంలో ప్రస్తావించినట్టే, నీతిమంతులైన మృతులు నేరుగా పరలోకానికి వెళ్లతారనే భావనకు ప్రధానమైన ఆక్షేపణ ఏమంటే - అది చాలావరకు తీర్పు దినం ఉందనే బైబిలు ఉపదేశాన్ని చెల్లకుండ చేస్తుంది. ఈ సమస్యను తొలిగించడానికిగాను ఒక వ్యక్తి ఏమన్నాడంటే, క్రీస్తు వచ్చినప్పుడు తీర్పుతీర్చే ఒక దినానికి బదులు, ప్రతివ్యక్తి తన తీర్పు దినాన్ని ఎదుర్కొంటాడట - అది అతడు మరణించినప్పుడట, తీర్పు దినాన్ని గూర్చి సవిస్తరంగా మాట్లాడడానికి స్థలం లేదు. అయితే ఆలోచింపవలసిన కొన్ని మాదిరి లేఖన భాగాలున్నాయి:

(1) బైబిలు "తీర్పు దినాన్ని" గూర్చి తరచుగా మాట్లాడుతుంది (మత్తయి 10:15; 11:22, 24; 12:36; 2 పేతురు 2:9; 3:7; 1 యోహాను 4:17). "మహాదినమున జరుగు తీర్పు" అని యూదా 6 అంటుంది. "తాను నియమించిన మనుష్యుని ద్వారా నీతిననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడు ఒక దినమును నియమించి" నట్టు పౌలు తెలిపాడు (అపొ. 17:31). ఈ ప్రత్యేకమైన దినాన్ని క్రీస్తు "అంత్య దినము" అని తెలిపారు (యోహాను 6:39, 40, 44, 54; 11:24; 12:48).

(2) క్రీస్తు తన "మహిమతోను దూతలతో కూడను" వచ్చిన రోజున తీర్పు జరుగుతుంది (మత్తయి 25:31ఎ). "అప్పుడు ఆయన తన మహిమగల సింహాసనములపై ఆసీనుడై యుంటారు'' (మత్తయి 25:31బి). అప్పుడు నీతిమంతులును, అనీతిమంతులునైన మృతులందరు లేపబడతారు (యోహాను 5:28, 29; ప్రకటన 20:13ఎ).

(3) అందరు సింహాసనము ఎదుట నిలబడతారు (ప్రకటన 20:11, 12; మత్తయి 25:32ఎ[5]), మరియు అందరు తీర్పుపొందుతారు (ప్రకటన 20:12, 13). ఇందులో నీతిమంతులు కూడ చేర్చబడతారు. క్రైస్తవులకు రాస్తూ, పౌలు యిలా అన్నాడు: "మనమందరము దేవుని న్యాయపీఠము ఎదుట నిలుతుము" (రోమా 14:10). మరల అపొస్తలుడు యిలా అన్నాడు: "ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి

మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహములో జరిగించినవాటి ఫలము ప్రతివాడును పొందునట్లు మనమందరము క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ. 5:10).

(4) ఆయన తీర్పు సింహాసనము ఎదుట జనులు నిలిచినప్పుడు, ప్రభువైన యేసు ...

> ... గొల్లవాడు మేకలలోనుండి గొఱ్ఱెలను వేరు పరచునట్లు ఆయన వారిని వేరుపరచి తన కుడివైపున గొఱ్ఱెలను ఎడమవైపున మేకలను నిలువబెట్టును. అప్పుడు రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి – నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించు కొనుడి; ... అప్పుడాయన యెడమవైపున ఉండువారిని చూచి – శపింపబడిన వారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన అగ్నిలోనికి పోవుడి ... వీరు నిత్య శిక్షకును, నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు (మత్తయి 25:32–46; ప్రకటన 20:15; 21:1–4 చూడు).

మృతుల యొక్క ప్రస్తుత స్థితిని గూర్చి నీవు నేను ఏకీభవింపకపోవచ్చు, కాని తీర్పు మహా దినమున్నదన్న విషయంలో మనం ఏకీభవిస్తామని నా నిరీక్షణ. "భూమి మీదనున్న ఈ జీవితం మహోన్నతమైన సంఘటనవైపు సాగిపోతుంది."[6]

"మృతులైన వారెక్కడ?" అనే ప్రసంగంలో, చెప్పబడిన భావాలను బట్టి ఈ ప్రశ్న అడుగవచ్చునని తెలిపాను; ఏమంటే – "తీర్పుకు ముందే నశించినవారు రక్షింపబడినవారి మధ్య విభాగింపబడినట్టు లూకా 16 చిత్రించినట్టయితే, తీర్పుదినము యొక్క అవసరత ఏమి?" అనేది. ఆ ప్రసంగంలోను, యితర చోట్లను ఈ రెండింటితోపాటు, అనేక అవకాశాలను నేను సూచించాను: తీర్పు దినం యొక్క "ప్రాథమిక ఉద్దేశం, దోషులు, నిర్దోషులను నిర్ధారించడానికి గాక, నీతి న్యాయాలను కనుపరచి, తీర్పు చెప్పడమేనని చూచాం."[7] మర్త్యమైన ఈ దేహపు హద్దులలోనుండి విడుదల పొందినప్పుడు, దేహములు లేని ఆత్మల యొక్క దుఃఖకరమైన లేక సంతోషకరమైన స్థితి దైవికమైన విధినిబట్టికాక, ప్రతి వ్యక్తి ఆత్మ సంబంధమైన తన స్థితిని ఎరుగుటవలన కలిగే అవకాశముంది. నేరుగా పరలోకం వెళ్లతారనే స్థితి ఎదుర్కొనే కష్టాలతో పోల్చితే, మధ్యస్థపు స్థితి అనే విశ్వాసం నుండి ఎలాటి కష్టాలు ఎదురైనా, అవి అల్పమైనవేనని నేను నమ్ముతాను. ఆ స్థితిని నేను అర్థం చేసికొన్నట్టు – ఆత్మలు పరలోకానికి వెళ్లతాయి, తీర్పు సింహాసనం ఎదుట ప్రత్యక్షం అవ్వడానికి తిరిగి అవి పరలోకంనుండి తేబడతాయి,[8] అవి అంతకుముందు ఎక్కడున్నాయో అక్కడికి మరల వెళ్లతాయి అని ఆ విశ్వాసం అంటుంది.

ముగిస్తుండగా, మనం శరీరంలో ఉండగా సంపూర్ణంగా గ్రహించలేని అంశాల్లో యిది ఒకటని నేను ఒప్పుకొంటున్నా, వాస్తవమేమంటే, ఇది నాకు అంతగా పట్టింపుగా ఉండే అంశం కాదు. మరణంలో నేను కన్నులు మూసినప్పుడు, అబ్రాహాము రొమ్ము లేక పరదైసు అనే చోటు నేను కండ్లు తెరువగలిగితే, అది నన్ను మహాదానందంలో ముంచుతుంది. పరలోకమందు క్రీస్తు ప్రభువు చేతుల్లో నేను ఉన్నట్టు కనుగొన్నా, నేను నిరాశపడబోయేది లేదు. వాస్తవంగా, కృతజ్ఞతతో కూడిన నా స్తుతి నీకు వినిపిస్తుంది. అతి ముఖ్యమైన సంగతి ఏమంటే నీవు నేను మరణం కొరకు సిద్ధపడియుండాలి.

అప్పుడు మన ఆత్మలు ఎక్కడికి చేరినా మనం “ప్రభువుతో కూడ ఉంటాం!” ఆమేన్, ఆమేన్.

---

## సూచనలు

[1]సర్దుబాటు భాష అనేది ప్రస్తుతం ఉపయోగిస్తున్న పద ప్రయోగానికి “అడ్జెస్టు” అగుటను సూచిస్తుంది. [2]మత్తయి 12:29 పై వ్యాఖ్యానానికి “క్రీస్తు జీవితం, 2”ను చూడు. [3]“మృతులు ఎక్కడ ఉన్నారు?” అనే ప్రసంగానికి పాఠములకు మధ్య కొంత విషయాలు మరల మరల చెప్పడమయ్యింది. [4]దైవ ప్రేరేపిత రచయితల ప్రతిపాదనలు పైపైకి అసంబద్ధంగా కనిపిస్తుంటాయి. అయితే రెండు ప్రతిపాదనలు సత్యమైనవే. [5]మత్తయి 25, ప్రకటన 20లో ఉన్న విషయాలను తాత్కాలికంగా సంభవాలని వాటి ఉపదేశాన్ని నిరాకరిస్తుంటారు. మత్తయి 25:31–46పై వ్యాఖ్యానాన్ని “క్రీస్తు జీవితం, 6”లో చూడు. ప్రకటన 20:11–15 పై చర్చ కొరకు “ప్రకటన, 5”ను చూడు. [6]David Roper, “ప్రకటన, 5” చూడు. [7]David Roper, “When the Books Were Opened” (tract) (Pasadena, Tex.: Haun Publishing Co., n.d.), 9. [8]మనమందరము తీర్పు తీర్చబడు ఒక మహా దినముందనే విషయాన్ని నిరాకరించే ప్రజలున్నారని చూచాం, అయితే తీర్పు దినమును గూర్చి బైబిలు స్పష్టంగా చెప్పుతుందని నేను నమ్ముతున్నాను.

# అనుబంధపు పాఠాలు, 3

మాదిరి ప్రార్థన (మత్తయి 6:9-15; లూకా 11:1-4)

"నీవు దేవుని రాజ్యమునకు దూరముగా లేవు" (మార్కు 12:28-34)

మారుమనస్సు పొందు లేదా నశించిపో ! (లూకా 13:1-5)